క్లుప్తంగా

నాగయ్య కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నేతలు

హనుమంతునిపాడు: మృతిని కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. వివరాల్లోకి వెళితే..మండల పరిధి తిమ్మారెడ్డిపల్లి ఎస్సీ కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద వేశపోగు నాగయ్య కుటుంబానికి వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు, దాసరిపల్లి గ్రామ సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేశపోగు గురుప్రసాదు నాగయ్య కుటుంబానికి రూ 10 వేల ఆర్థికసాయం అందజేశారు. గ్రామస్తులు కోలా గురువయ్య, కొండయ్యసుధాకర్ పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

సీఎస్‌పురం(పామూరు): భూములు ఉన్న రైతులు విధిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు పూర్తి చేయించుకోవాలని వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని పెదగోగులపల్లె రైతుసేవాకేంద్రం పరిధిలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు త్వరితగతిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకోవాలని, దీని ద్వారా రైతులకు పథకాలు సులభతరమవుతాయన్నారు. ఈ సందర్భంగా పంటల సాగులో రైతులకు సాగుపై పలు సూచనలిచ్చారు. ఉద్యానవనశాఖ సహాయకులు వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ


పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని పైడిపాడు గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి-4 సర్వేతో పేదరికాన్ని నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి


నివాళులర్పిస్తున్న చైర్మన్ గఫార్, బాలగురవయ్య

కనిగిరిరూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ పిలుపునిచ్చారు. మంగళవారం అంబేడ్కర్ పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక ఒంగోలు బస్టాండ్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఏప్రిల్ 14న జరిగే అంబేడ్కర్ జయంతిని పట్టణంలోని అన్ని వర్గాలు, సంఘాలు అందరూ కలిసి సమష్టిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు చదలవాడ బాలగురవయ్య, పందిటి మోహన్, సర్పంచ్ దమ్ము వెంకటయ్య, బాదుర్లా, రమణ వెంకటేశ్వర్లు, శాంత రాజు, గడ్డం తిరుపతయ్య, చెరుకూరి చిన కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని తిప్పలు


నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్


వీరరాంపురం ఎస్సీకాలనీకి సాగర్ జలాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న దళిత కాలనీ వాసులు

- మరమ్మతులకు నోచుకోని సాగర్ జలాల పంపింగ్ మోటార్లు
- నిరుపయోగంగా ఉన్న సంపులు, ఓహెచ్ ట్యాంకులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

హనుమంతునిపాడు:

మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు చందవరం ప్రాజెక్టు నుంచి మండలానికి సరఫరా అయ్యే నీటిని సక్రమంగా అందించడం లేదు. కొండ శివారు గ్రామాలకు నీరు అందక తాగునీటికి తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. మండలంలో దాదాపు 20 వరకు ఓవర్‌హెడ్ ట్యాంకులు, మినీ ట్యాంకులు ఏర్పాటు చేశారు. అయితే నీరు పైపులైన్ల ద్వారా కొండ శివారు గ్రామాలకు పంపింగ్ చేసి ఎక్కించేందుకు కూడాగుంట్ల వాలిచర్ల, నందనవనం, హాజీపురం అడ్డరోడ్డులో మోటార్లు, సంప్‌లు, ట్యాంకులు ఏర్పాటు చేశారు. అయితే కూటాగుండ్ల, వాలిచర్ల, నందనవనం వద్ద సంప్ మోటార్లు కాలిపోయి ఏడు ఎనిమిది నెలలు గడుస్తోంది. అయినా మరమ్మతులకు నోచుకోలేదు. చందవరం ప్రాజెక్టు నుంచి వచ్చే సాగర్ జలాలు హాజీపురం, హనుమంతునిపాడు దాటి పై గ్రామాలకు చుక్క నీరు సరఫరా కావడం లేదు. దాసరిపల్లి, కొండారెడ్డిపల్లి, హాజీపురం అడ్డరోడ్డు వరకు పైపులైన్లు మొత్త లీకులమయం. వాటి మరమ్మతుల గురించి పట్టించుకునే వారే కరువయ్యారు.

కాలిపోయిన మోటార్లు:
కూటాగుండ్ల, వాలిచర్ల, నందనవనం వద్ద మోటార్లు కాలిపోయి ఏడు నెలలు దాటింది. అయినా అధికారులు పట్టించుకొని మరమ్మతులు చేయలేదు. దీంతో కూటాగుండ్ల, దాసళ్లపల్లి, ముప్పళ్లపాడు, రామాయిపల్లి, వీరగారెడ్డిపల్లి వరకు సాగర్ జలాల సరఫరా నిలిచిపోయింది. బోర్ల నుంచి ఫ్లోరైడ్ నీటిని తాగి వ్యాధుల బారిన పడుతున్నారు. వాలిచర్లసంపు నుంచి నందిరెడ్డిపల్లి, అప్పలరెడ్డిపల్లి, గురవారెడ్డిపల్లి గ్రామాలకు సాగర్ జలాలు అందడం లేదు. సంప్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకులు నిరుపయోగంగా దర్శనమిస్తునానయి. నందనవనం వద్ద మోటార్లు మరమ్మతులతో నందనవనం సంప్ నుంచి వీరరాంపురం, నందనవనం, పాపిరెడ్డిపల్లి, గమ్మళ్లపాలెం, మంగంపల్లి గ్రామాలకు సరపరా అయ్యే నీరు నిలిచిపోయింది. దీంతో ఆ గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.


మూలనపడిన పంపింగ్ మోటార్లు

నిరుపయోగంగా ఓహెచ్ ట్యాంకులు..
మండలంలో సాగర్ జాలాలు నింపి గ్రామాలకు కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేసే ట్యాంక్‌లకు నీరు ఎక్కించడం లేదు. దీంతో గ్రామాల్లో ట్యాంకులు నిరుపయోగంగా దర్శనమిచ్చాయి.

లీకులతో నీరు వృథా..
మెయిన్ పైప్‌లైన్ల లీకులతో వచ్చే సాగర్ జలాలు వృథాగా పోతున్నాయి. వాటి మరమ్మతుల గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో మండు వేసవిలో తాగునీరు అందక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఉన్నతాధికారులు వేసవిలో తాగునీటి సమస్య రాకూడదని ప్రకటనలు ఇవ్వడమే గానీ క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఏడాది కాలం నుంచి వీరరాంపురం గ్రామంలోని ఎస్సీ కాలనీకి సాగర్ తాగునీరు సరఫరా కావడం లేదు. కాలనీలో ఉన్న చేతి పంపులు సైతం మరమ్మతులకు గురయ్యాయి. కానీ ఎవ్వరూ మరమ్మతులు చేయలేదని, దీంతో అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.


లీకులతో వృథాగా పోతున్న సాగర్ జలాలు

హామీలు విస్మరించి అక్రమ కేసులా..


మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్


ఆలయంలో పూజలు చేస్తున్న దద్దాల నారాయణ యాదవ్

- 2029లో జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం
- రానున్న రోజులన్నీ వైఎస్సార్‌సీపీవే
- అందరం సమష్టిగా ముందుకు సాగుదాం
- వైఎస్సార్‌సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ

కనిగిరిరూరల్: కూటమి సర్కార్ హామీలన్నింటినీ విస్మరించి వాటి నుంచి ప్రజలను డైవర్ట్ చేసేందుకు అక్రమ కేసులు బనాయిస్తోందని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మండలంలోని నేలటూరి గొల్లపల్లిలో గంగా భవాని కోటేశ్వర దేవస్థానంలో కాటమరాజు తిరునాళ్ల మహోత్సవం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏర్పాటు చేసి విద్యుత్ ప్రభల వేదికపై పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలనలో రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయన్నారు. మేనిఫెస్టోలో 99 శాతం హామీలు అమలు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా గడప గడపకూ సంక్షేమ ఫలాలు అందాయన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి సర్కార్ హామీల అమలులో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. 9 నెలల కూటమి పాలనను ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రశ్నించిన వారిని అక్రమ అరెస్టు చేస్తూ రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజులన్నీ వైఎస్సార్ సీపీవేనన్నారు. 2029 ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు అందరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. తొలుత సర్పంచ్ గోడి నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం నియోజకవర్గ అధ్యక్షులు పల్నాటి భాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గాలిబోయిన ధనుంజయ్, ఎన్‌గొల్లపల్లి పార్టీ యూత్ ఫోర్స్, నాగార్జున, దాసరి మాల్యాద్రి, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌కు స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శివరామిరెడ్డి, బిండినపల్లి నాగూర్, మాల్యాద్రి, పెద్ద నారాయణ, మల్లికార్జున, వెంకట్రావ్, మితికలశ్రీను, పేరం మల్లికార్జునరెడ్డి, ఆవుల భాస్కర్‌రెడ్డి, కటికల వెంకటరత్నం, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, దాదిరెడ్డి మాల కొండారెడ్డి, ఏటీఆర్, తిరుపతిరెడ్డి, సిద్దటపు వెంకట సర్సారెడ్డి, ముల్లపాటి జయ, అబ్రాము, రాయుడు, హరి కృష్ణా, గంగసాని లక్ష్మీ నారాయణ, రఫీ, మల్లికార్జున, గాయం సురేష్, పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, తమ్మినేని సుజాతారెడ్డి, శ్రీహరిరెడ్డి, సిద్ధారెడ్డి, శివరామయ్య, నాగమణి, తాతపూడి సురేష్, ఒమేగా రామిరెడ్డి, గట్ల విజయ భాస్కర్‌రెడ్డి, సంగటి మహేంద్రారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు యక్కంటి శ్రీనివాసులరెడ్డి, స్వర్ణ ఏడుకొండలురెడ్డి, ఇండ్లా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరునాళ్ల మహోత్సవం..
ఎన్ గొల్లపల్లిలో సోమవారం రాత్రి కాటంరాజు తిరునాళ్ల, మంగళవారం అమ్మవారికి పొంగళ్ల మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో దద్దాల నారాయణ విశిష్ట పూజలుచ ఏశారు. తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా పాల్గొన్నారు.

నిరసన జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఫ్యాప్టో నాయకులు నాయబ్‌రసూల్


వాల్ పోస్టర్‌లను విడుదల చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

పామూరు: డిమాండ్ల పరిష్కారం కోరుతూ బుధవారం ఒంగోలులో ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరగనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పామూరు జోన్ ఫ్యాప్టో నాయకులు షేక్.నాయబ్‌రసూల్, వై.రామచంద్రారెడ్డి కోరారు. స్థానిక 5వ వార్డు పాఠశాలలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఫ్యాప్టో సమావేశంలో వారు మాట్లాడుతూ 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఒంగోలులో తలపెట్టిన నిరసనలో వేలాదిగా ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీనియర్ నాయకులు బి.వెంగళరెడ్డి, పి.తిరుపతిరెడ్డి, టి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 2003 డీఎస్సీ వారికి వెంటనే పాత పెన్షన్ వర్తింపచేయాలని, 176 నెలల డీఏ బకాయిలు, సరెండర్ లీవులు చెల్లించాలని కోరారు. సమావేశంలో పామూరు, సీఎస్‌పురం మండలాల ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కనిగిరిరూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 2వ తేదీన బుధవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన జయప్రదం చేయాలని ఫ్యాప్టో జోనల్ కన్వీనర్ దద్దాల శ్రీనివాసుల యాదవ్ అన్నారు. స్థానిక ఏపీటీఎఫ్ జోనల్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు రాజ్ కుమార్, టి.రమణారెడ్డి, డి.తిరుపతిరెడ్డి, ఎం రాములు మాట్లాడుతూ 12వ పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు పాత పెన్షన్ అమలు చేయాలని, సరండర్ లీవు బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు డి.శ్రీనివాసులు, బి.మల్లికార్జునరెడ్డి, పట్నం నరసింహులు, కె.బాలకృష్ణ, ఐ వెంకటేశ్వర్లు, హజరత్‌రెడ్డి, కేవీ సుబ్బయ్య, పి.శ్రీనివాసులు, ఎం బ్రహ్మయ్య, ఎస్కే జిలానీ, కె. వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

49 పొగాకు బేళ్లు తిరస్కరణ


వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి సునీల్‌కుమార్


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి శ్రీనివాసరావు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం జరిగిన వేలంలో 49 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. చోడవరం, ముప్పవరం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 388 బేళ్లను తీసుకురాగా 339 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.250, సరాసరి ధర రూ.268.68 పలికింది. వేలంలో 12 కంపెనీల వ్యాపారులు పాల్గొన్నారు. వేలాన్ని పొగాకు బోర్డు వైస్ చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య పరిశీలించారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో మంగళవారం జరిగిన వేలంలో గరిష్ట ధర రూ. 281 పలికింది. కె. ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 473 బేళ్లను తీసుకురాగా వాటిలో 406 బేళ్లను కొనుగోలు చేసి 67 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.281, కనిష్ట ధర రూ.240, సరాసరి రూ.266.56 పలికింది. వేలంలో 13 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు

పొన్నలూరు: యువకులు క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కట్టా అనూక్ హెచ్చరించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం క్రికెట్ బెట్టింగ్‌లపై యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్నందున బెట్టింగ్ యాప్‌లు ద్వారా భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ఇప్పటికే పలు చోట్ల యువకులు ఆన్‌లైన్ జూదం, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడి అప్పులపాలై రోడ్డున పడటమే కాకుండా గత్యంతరం లేకా ఆత్మహత్యలకు చేసుకుంటున్నారన్నారు. బెట్టింగ్ చట్టరీత్యా నేరమని, యువకులు బెట్టింగ్ ఊబిలో పడొద్దని సూచించారు. మండలంలో ప్రత్యేక నిఘా టీంను ఏర్పాటు చేశామని, గ్రామాల్లో ఎక్కడైనా గుంపులుగా ఉండి బెట్టింగులకు పాల్పడుతూ పట్టుబడితే చట్ట పరమైన కేసులు బనాయిస్తామని హెచ్చరించారు.


యువకులతో మాట్లాడుతున్న ఎస్సై అనూక్

కొత్త పింఛన్లు మంజూరు చేయాలి

కనిగిరిరూరల్: ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 11వ వార్డు కాశిరెడ్డి కాలనీలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు కావస్తున్నా నూతన పింఛన్లు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. అర్హులంతా పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం అర్హత కల్గిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణం స్పందించి అర్హులందరికీ ప్రధానంగా డయాలసిస్ పేషంట్లకు పింఛన్లు మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


రేషన్ వాహనంను తనిఖీ చేస్తున్న చైర్మన్ గఫార్

అనంతరం మొబైల్ రేషన్‌వాహనాన్ని తనిఖీ చేశారు. డీలర్లు, ఎండీయూ అపరేటర్లు కుమ్మక్కై, కార్డుదారులకు మోసం చేస్తే సహించేది లేదని చైర్మన్ హెచ్చరించారు. రేషన్ పంపిణీ పై పేదలు ఫిర్యాదు చేస్తే సహించేది లేదన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు


పరీక్షలు ముగియడంతో సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు


హెచ్‌ఎంపాడు: చివరి పరీక్ష రాసి ఆనందంతో బయటకు వస్తున్న విద్యార్థులు


పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు


సింగరాయకొండ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

పొన్నలూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. మండలంలోని ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలతో పాటు రెండు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. స్థానిక జెడ్పీ పాఠశాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 160 మంది విద్యార్థులు, అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 116 మంది, విప్పగుంట పరీక్ష కేంద్రంలో 93 మంది మొత్తం 369 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పొన్నలూరులో ఇద్దరు విద్యార్థులు పరీక్షలకు హాజరు కాలేదని చీఫ్ వెంకట్రావు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు ముగిసే వరకు కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ విధించి ఎస్సై అనూక్ పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

పామూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు 742 మంది విద్యార్థులకు గాను 738 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్‌లు మందాకుమారి, బి.డేవిడ్, అరియారం సురేష్, జె.పోతురాజు, ఎన్.వెంకట్రామయ్య, డీఓలు నాగేంద్రరావు, ఎం రామస్వామి, తిరుపతయ్య, ఎస్కే.షరీఫ్, ఖాజామస్తాన్ పర్యవేక్షించారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు సోషల్ పరీక్షకు 348 మంది విద్యార్థులకు గాను 346 మంది హాజరయ్యారు. పరీక్షలను చీఫ్ సూపరింటెండెంట్‌లు చావా శ్రీనివాసులు, అబ్దుల్ సుబాన్, డీఓలు బాషా, ఖాజారంతుల్లా పర్యవేక్షించారు.

మర్రిపూడి: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ ఎంవీపీ రంగయ్య తెలిపారు. మొత్తం 296 మంది విద్యార్థులకు గాను ఒక విద్యార్థి గైర్హాజరయ్యాడు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషంగా బయటకు వచ్చారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా శ్యాంసన్, దశరధరామిరెడ్డి, డిపార్టుమెంటల్ అధికారులుగా వై కృష్ణప్రసాద్, హనుమంతరావు వ్యవహరించారు.

కొండపి: మండలంలో పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఎంఈఓ 2 రామారావు తెలిపారు. మొత్తం 539 మంది హాజరు కావాల్సి ఉండగా 531 మంది హాజరయ్యారు. విద్యార్థులు సంతోషంగా బయటకు వచ్చారు.

హనుమంతునిపాడు: మండలంలో చివరి రోజు పదో తరగతి పరీక్షలకు ఒకరు గైర్హాజరయ్యారు. 284 మందికి గాను 283 మంది హాజరయ్యారు. చివరి రోజు కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా బయటకు వచ్చారు.

సింగరాయకొండ: మండలంలో మంగళవారం పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షలు ముగియటంతో విద్యార్థులు సంతోషంగా బయటకు వచ్చారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో 843 మంది విద్యార్థులు హాజరయ్యారు.

టంగుటూరు: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. స్థానిక స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 169 మంది హాజరయ్యారు. ఎస్సై నాగమల్లీశ్వరరావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

పెన్షనర్స్ రూల్స్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి


మాట్లాడుతున్న తమ్మినేని పెద్దిరెడ్డి

కనిగిరిరూరల్: కేంద్ర ప్రభుత్వ పెన్షర్స్ రూల్స్ సవరణను పెన్షనర్ల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని పెద్దిరెడ్డి, నరసింహారావు అన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం పెన్షనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న పెన్షనర్ సవరణ బిల్లు ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర ప్రమాదకరమని, దాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం ఆమోదం పొందితే కోట్లాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. సవరణ బిల్లును తక్షణ ఆపివేయాలని వారు డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు ముక్కు వెంకటరెడ్డి, నాగభూషణం, మీగడ వెంకటేశ్వరరెడ్డి, వి.మాలకొండారెడ్డి, గౌస్ మొహిద్దీన్, ప్రభాకర్‌రెడ్డి, యర్రారెడ్డి, కె. కృష్ణమూర్తి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెన్షనర్ల సంఘం సహాయ కార్యదర్శిగా పనిచేసి మృతి చెందిన ఎస్కే జైనులాబ్దీన్‌కు ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే అధిక కూలీ

లింగసముద్రం: ఉపాధిహామీ పనుల్లో అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం కూలీలు పని చేయాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. మండలంలోని చినపవని గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ కూలీలకు కొన్ని సూచనలిచ్చారు. కూలీలు కొలత ప్రకారం పని చేస్తే రోజు వేతనం రూ.300 వస్తుందన్నారు. ఉదయాన్నే పనులకు వెళ్లి 10 గంటల్లోపు ఇంటికి చేరుకుంటే ఎండ వేడిమి నుండి తప్పించుకోవచ్చని సూచించారు. అనంతరం పింఛన్‌ల పంపిణీని పరిశీలించారు. చినపవని గ్రామంలో ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను సేకరించే విధానాన్ని పరిశీలించి డంపింగ్‌యార్డ్ వద్ద నాడెప్ పిట్లను పరిశీలించారు.

షోకాజ్ నోటీసులు జారీ

గుడ్లూరు: సామాజిక పెన్షన్‌ల పంపిణీలో భాగంగా అలసత్వం వహించిన ఉద్యోగులకు ఎంపీడీవో షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నగదు బ్యాంక్ నుంచి విత్ డ్రా చేసికొంత మంది పీడీవోలకు అందజేయడంలో అలసత్వం వహించిన బసిరెడ్డిపాలెం సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ రాజీవ్, గ్రామ సర్వేయర్, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో వెంకటేశ్వరరావు షోకాజ్ నోటీసులు మంగళవారం అందజేశారు. 24 గంటల్లో వివరణ ఇవ్వకపోతే పైఅధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారు.